సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం | 6 | ఆగస్టు | 2024



ఎర్రచందనం స్వాధీనం

కారుతో సహా రూ. 15.5 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ జె.వి. సుబ్బారెడ్డి తెలిపారు. -8లో



రాణించిన కడప బ్యాట్స్‌మన్

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో కడప బ్యాట్స్‌మన్ నలుగురు హాఫ్ సెంచరీలతో రాణించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.290	రూ.340
రెండోరకం	రూ.200	రూ.268

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 632 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం



రాజంపేట టౌన్: జిల్లాలోని 3 ప్రభుత్వ, 12 ప్రైవేట్ ఐటీఐలలో మిగిలిపోయిన సీట్లలో ప్రవేశాలకు ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ కన్వీనర్ కె.శ్రీనివాస్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది ఉత్తీర్ణులైన విద్యార్థులు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమకు దగ్గరిలోని ఐటీఐలో తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, కులధృవీకరణ పత్రాలను పరిశీలన చేయించుకోవాలన్నారు.లేకపోతే వారి పేర్లు మెరిట్ జాబితాలోకి రావని తెలిపారు.

నూతన నియామకం



మారసాని రాజారెడ్డి

కురబలకోట: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా అంగళ్లుకు చెందిన బీజేపీ నాయకులు మారసాని రాజారెడ్డిని నియమించారు. సహకరించిన మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని బాధ్యతాయుతంగా నిర్వహిస్తానని రాజారెడ్డి తెలిపారు. కురబలకోట రైల్వే స్టేషన్‌తోపాటు వివిధ స్టేషన్ల అభివృద్ధికి తోడ్పడతానని చెప్పారు.

గిరిజన అభ్యర్థులకు డీఎస్సీలో శిక్షణ

రాయచోటి (జగదాంబసెంటర్): బీఈడీ/డీఈడీ కోర్సులు పూర్తి చేసి టెట్‌లో ఉత్తీర్ణత పొందిన గిరిజన కులానికి చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు డీఎస్సీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉచిత కోచింగ్ ఇవ్వనుంది. ఈ విషయాన్ని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారిణి పి.తేజస్విని ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కలదన్నారు. గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు వారి పూర్తి బయోడేటాతో పాటు విద్యార్హత, కులధృవీకరణపత్రం, రేషన్, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు కలర్ ఫొటో, బీఈడీ/డీఈడీ, టెట్ కోర్సులకు సంబంధించి ధృవీకరణ పత్రం నకలును గెజిటెడ్ అధికారితో ధృవీకరించి రాయచోటిలోని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయం, మైనార్టీ బాలికల వసతి గృహం, కలెక్టరేట్ ప్రాంగణంలో ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలన్నారు. వివరాలకు 8332082016 నంబర్‌లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పుల్లంపేట: పుల్లంపేట ఏపీ ఆదర్శపాఠశాలలో చదువుతున్న జస్మిన్, మధు, గోపీకృష్ణ, రిషిత అనే నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు.ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ లీలా శ్రీహరి, వ్యాయామ ఉపాధ్యాయుడు నీలకంఠేశ్వరరావు తెలిపారు. సెప్టెంబర్ 17 నుంచి 19వ తేది వరకు శ్రీకాకుళంలో జరగనున్న పోటీల్లో వీరు పాల్గొంటారని వారు తెలిపారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్ఓ సత్యనారాయణ

రాయచోటి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని డీఆర్ఓ సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. డీఆర్ఓతో పాటు కలెక్టరేట్ ఎస్డీసీ రామసుబ్బయ్య ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీదారుల నుంచి అందిన సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని డీఆర్ఓ తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలను పరిశీలించి, విచారణ చేసి పారదర్శకతో నాణ్యతగా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● ఇదేమి రాజ్యం..

ఆగని టీడీపీ దౌర్జన్యం

అధికార దర్పంతో టీడీపీ నేతలు బరి తెగిస్తున్నారు. తమను ప్రశ్నించే వారిపై దాడులకు తెగబడుతున్నారు. ప్రతిపక్ష నేతలనే కాదు.. తమకు సహకరించని ఉద్యోగులను టార్గెట్ చేస్తున్నారు. తాజాగా సంబేపల్లె మండలం దుద్యాల పంచాయతీ పరిధిలోని పెద్దజంగంపల్లెకు చెందిన అంగన్వాడీ వర్కర్ జె.నాగరత్నను టీడీపీ గ్రామ నాయకులు ఇబ్బంది పెట్టడంతో ఆత్మహత్యకు యత్నించిన ఘటన కలకలం రేపుతోంది.

- మాట వినని వారికి తప్పని వేధింపులు
- వేధింపులు భరించలేక అంగన్‌వాడి కార్యకర్త ఆత్మహత్యాయత్నం
- వైఎస్సార్ సీపీ నాయకులే టార్గెట్‌గా బాబుల్‌రెడ్డి అరెస్టు



కారు షెడ్డును కూల్చేసిన దృశ్యం (ఇన్‌సెట్) జెడ్పీటీసీ గజ్జెల శృతి ఇంటి అద్దాలు పగులగొట్టిన దృశ్యం

సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి రాగానే కూటమి నేతలు తెగబడుతున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఏం చేసినా చెల్లుతుందని దాడులకు పూనుకుంటున్నారు. వైఎస్సార్ సీపీలో క్రియాశీలకంగా పనిచేసిన వారిని భయపెట్టడం ఒక ఎత్తయితే, పోలీసుల ద్వారా వేధించడం మరొక ఎత్తు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాకముందే వైఎస్సార్ సీపీ శ్రేణులను టార్గెట్ చేస్తున్నారు. ఏదో ఒక రకంగా వారి ఆర్థిక లావాదేవీలకు సబంధించిన మూలాలపై దెబ్బకొడుతున్నారు. ఇదేమని అడిగే వారు లేకపోగా, అధికారులు చేసేదేమి లేక మిన్నకుండి పోతుండటం గమనార్హం

తప్పని వేధింపులు

అన్నమయ్య జిల్లాలో అధికారంలోకి రాగానే టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ నేతలనే కాకుండా చిన్నపాటి ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నారు. వేధింపులతోపాటు భయపెట్టడం ద్వారా వారు చిన్నపాటి ఉద్యోగాలు వదిలేస్తే తమ వారిని నియమించుకోవచ్చన్న కుటిల నీతికి తెర లేపుతున్నారు. రాయచోటి పరిధిలోని సంబేపల్లె మండలం దుద్యాల పంచాయతీ పరిధిలోని పెద్దజంగంపల్లెకు చెందిన అంగన్వాడీ వర్కర్ జె.నాగరత్నను టీడీపీ గ్రామ నాయకులు ఇబ్బంది పెట్టడంతో చేసేదేమి లేక ఈనెల 3వ తేదీన పురుగుల మందు తాగా ఆత్మహత్యాయత్నం చేసింది. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగరత్నకు సీఐటీయూ నేతలు అండగా నిలిచారు. టీడీపీ నేతలు వేధింపులు మానుకోవాలని సోమవారం కలెక్టరేట్ వద్ద కూడా ఆందోళన చేపట్టారు. రాయచోటి పరిధిలోని గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగిపై వేధింపులకు పాల్పడడంతో ఆమె కూడా ఇలాగే యత్నమే చేసింది. ఇలా అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి చిన్నపాటి ఉద్యోగులను టార్గెట్ చేస్తుండడం సర్వత్రా ఆందోళనకు గురి చేస్తోంది.

వైఎస్సార్ సీపీ నాయకులే టార్గెట్

అన్నమయ్య జిల్లాలో వైఎస్సార్‌సీపీ నాయకులే టార్గెట్‌గా టీడీపీ శ్రేణులు దౌర్జన్యాలకు దిగుతున్నాయి. నెల రోజుల కిందట గుర్రంకొండ పోలీసు స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులను కూర్చొబెట్టారన్న కోపంతో ఏకంగా పోలీసుస్టేషన్ పైకే టీడీపీ శ్రేణులు దాడికి తెగబడ్డాయి. తాజాగా ఈనెల 4వ తేదీన జిల్లాలోని జిల్లా కేవీ పల్లె జెడ్పీటీసీ సభ్యురాలు గజ్జెల శృతి ఇంటిపై టీడీపీ వర్గీయులు దాడి చేశారు. శృతి, ఆమె భర్త గజ్జెల శ్రీనివాసులురెడ్డి ఇంటిలో లేని సమయంలో గాలి ఆనంద్ నాయుడు, జయరామనాయుడు 20 మంది అనుచరులతో కలిసి భయోత్పాతం సృష్టించారు. జెడ్పీటీసీ ఇంటిపై రాళ్లతో దాడి చేసిన అనంతరం వైఎస్సార్ సీపీ కార్యకర్త తారకనాథరెడ్డిని తీవ్రంగా కొట్టి గాయపరిచి కారులో తీసుకెళ్లి రోడ్డు పక్కన వదిలేసి వెళ్లిపోయారు. అంతకుముందు తారకనాథ్‌రెడ్డిని రెండు, మూడు గంటలపాటు చిత్రహింసలకు గురి చేసినట్లు తెలియవచ్చింది. ఇలా భయోత్పాతాలు సృష్టించడం ద్వారా వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మస్థైర్యం దెబ్బతీయడమే లక్ష్యంగా టీడీపీ నేతలు అడుగులు వేస్తున్నారు.

పింఛన్లను ఆపేసి...వేధించి..తర్వాత అందించి

పీలేరు పరిధిలోని కలకడ మండలం రాచగుంటపల్లె పంచాయతీలోని ఎగువబట్టవారిపల్లెలో రెండు నెలలుగా పింఛన్ దారులపై కూడా వేధింపుల పర్వం కొనసాగింది. గ్రామానికి చెందిన 25 మందికి...అందులో కొంతమంది దళితులకు పింఛన్లు అందించకుండా ఆపేశారు. ఇళ్లపై టీడీపీ జెండాలు కట్టాలని... టీడీపీ వైపు ఉంటామని ప్రమాణం చేస్తేనే పింఛన్లు ఇస్తామని గ్రామ చోటా మోటా నేతలు పట్టుబట్టారు. అయితే ఐదుగురు పింఛన్ దారుల ఇళ్లపై టీడీపీ జెండాలు నాటిన తర్వాత ప్రమాణం చేయించి వారికి పింఛన్లు అందించారు. అయితే ఈ విషయంపై వారు జేసీకి ఫిర్యాదు చేయడం, సమాచారం సాక్షిలో ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు జెండాలు తీసివేయడంతోపాటు గ్రామంలో పెండింగ్‌లో ఉన్న అర్హులైన 20 మందికి యదావిధిగా పింఛన్ పంపిణీ చేశారు. కేవలం వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపారన్న నెపంతో కొద్దిరోజులుగా అధికార పార్టీ నేతలు ఇబ్బంది పెట్టడం చర్చనీయాంశంగా మారింది. ఏదిఏమైనా అన్నమయ్య జిల్లాలో టీడీపీ చేస్తున్న దాడులు వేధింపులు తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.

▸▸ పాత కేసు తిరగదోడి..

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి సంబంధించి రైల్వేకోడూరు నియోజకవర్గంలో క్రియాశీలకంగా పనిచేస్తున్న పుల్లంపేట ఎంపీపీ బాబుల్‌రెడ్డిపై అధికార పార్టీ దృష్టి సారించింది. ఎంపీపీని ఎలాగైనా దెబ్బతీయాలన్న లక్ష్యంతో పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చి అనాలోచిత వ్యవహారాలకు తెర లేపారు. ఇందులో భాగంగా నాలుగు రోజుల కిందట చాపాడు పరిధిలో 2016/67 క్రైం నంబరుతో నమోదైన ఎర్రచందనం కేసులో ఎంపీపీని టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. తర్వాత కోర్టులో హాజరు పరచగా బెయిల్ లభించింది. ప్రధానంగా పుల్లంపేట మండలంతోపాటు నియోజకవర్గంలో కూడా మంచి పట్టు ఉన్న బాబుల్‌రెడ్డిని వేధింపులకు గురిచేస్తే వైఎస్సార్ సీపీ కార్యకర్తలు భయపడతారన్న లక్ష్యంతోనే పోలీసులు చర్యలకు ఉపక్రమించారు.

◆ వైభవంగా పల్లకీ సేవ



పల్లకిలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామిని పల్లకీలో ఊరేగించారు. సోమవారం రాత్రి శ్రీ వీరభద్ర స్వామి, శ్రీ భద్రకాళీ అమ్మవార్ల మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకర్య స్వామి, శేఖర్ స్వామి, మల్లికార్జున స్వామి, వేదపండితులు రాచరాయ యోగీ స్వామి భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. -రాయచోటి టౌన్

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి: అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వ్యవసాయం, , పశుసంవర్ధకం, అటవీ, మైనింగ్, నీటి వనరులు, పరిశ్రమలు, చేనేత, మౌళిక సదుపాయాలు,రోడ్లు, భవనాలు, విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, మున్సిపల్ పరిపాలన, పంచాయతీరాజ్, గృహ నిర్మాణం తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సదస్సులో అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం, రాయచోటి వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ చేయలేకపోతున్నాను

- స్వదేశానికి రప్పించండి
- నిమ్మనపల్లెకు చెందిన వివాహిత వేడుకోలు



బాధితురాలు హసీనాబీ

మదనపల్లె: ఉన్న ఊరిలో బతుకు ఈడ్చలేక, విదేశాలకు వెళ్లి డబ్బులు సంపాదించుకుని వస్తానని గంపెడాశతో వెళ్లిన ఓ వివాహిత...అక్కడ వెట్టిచాకిరీ చేయలేక, వెనక్కు వచ్చేస్తానని, ప్రాణముంటే చాలు అదే పదివేలు అనుకుంటానని ఏడుస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన వీడియో పలువురిని కంటతడి పెట్టిస్తోంది. నిమ్మనపల్లె పంచాయతీ తురకపల్లెకు చెందిన మస్తాన్, సయ్యద్ మాబీ దంపతుల కుమార్తె హసీనాబీ(26)కు స్థానికుడైన హసన్‌వలీతో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి అబ్దుల్ అజీజ్(8), అబ్దుల్‌వాజిద్(6) ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త హసన్‌వలీ ఎలక్ట్రిషియన్ పనులు చేస్తున్నాడు. హసీనాబీ కూలిపనులకు వెళ్లేది. తమ బంధువైన సహారాబాను(వదిన) కొంతకాలం క్రితం సౌదీ అరేబియాకు ఉపాధి కోసం వెళ్లింది. ఈ క్రమంలో హసీనాబీకి వీసా పంపుతానని, ఇక్కడకు వచ్చి బాగా డబ్బు సంపాదించవచ్చని చెప్పింది. దీంతో అక్కడకు వెళితే నాలుగురాళ్లు వెనకేసుకోవచ్చన్న ఆశతో భర్త, కుటుంబ సభ్యుల అనుమతితో హసీనాబీ జూలై 12న రాయచోటిలోని ఏజెంట్ సహాయంతో సహారాబాను పంపిన వీసాపై సౌదీఅరేబియాలోని రియాద్‌కు చేరుకుంది. నాలుగురోజుల పాటు వదిన సహారాబానుతో ఉన్న హసీనాబీ వీసా పొందిన ఇంటిలో పనికి వెళ్లింది. అయితే..ఆ ఇంట్లో ఎనిమిది మంది కుటుంబ సభ్యులు ఉండగా, మూడు బెడ్‌రూమ్‌లు, రెండు బాత్ రూమ్‌లు, ఒక హాల్, ఒక కిచెన్‌లతో కూడిన పెద్ద ఇంట్లో పనిచేయడం హసీనాబీకి కష్టంగా మారింది. అంతేకాకుండా ఉదయం 9 గంటల నుంచి మరుసటిరోజు తెల్లవారుజాము వరకు ఇంట్లో పనులు చేయాల్సి వచ్చేది. కేవలం రెండు, మూడు గంటల విశ్రాంతితో పనులు చేయలేకపోయినా, సదరు యజమాని ఇంట్లో వేధింపులు ఆగలేదు. కనీసం మూడుపూటల తిండి పెట్టకపోవడంతో అనారోగ్యానికి గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. బతుకు తెరువుకు వచ్చి బతకలేక ఇక్కడే చచ్చిపోతానేమోనని భయపడింది. చేసేదిలేక వెనక్కు వెళ్లి కాయకష్టం చేసుకుని బతుకుదామని భావించి తనను స్వదేశానికి రప్పించాల్సిందిగా వేడుకుంటూ వీడియోను కుటుంబ సభ్యులకు పంపింది. ఆ వీడియో కాస్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమె కష్టాన్ని విన్న ప్రతి ఒక్కరూ చలించిపోతున్నారు. ఆమెను స్వదేశానికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని భర్త హసన్‌వలీ కోరుతున్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఈ విషయమై తనతో మాట్లాడారని, రప్పించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు.

తిరగబడ్డ జీవితాలు

- కష్టాల్లో పాలేగార్ వారసులు
- నామమాత్రపు పెన్షన్‌తో ఇక్కట్లు
- పోరుబాటకు కార్యాచరణ



పాలేగార్ సంప్రదాయాయ వేడుకలో వారసులు (ఫైల్)

కడప సెవెన్‌రోడ్స్: వారసత్వంగా తమకు వస్తున్న తవర్జీ (పెన్షన్) పెంపు, ఆగిపోయిన వారికి పునరుద్ధరణ కోసం పూర్వపు పాలేగార్ వారసులు చాలా కాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తాము తిరుగుతున్నా అధికారుల నుంచి నిరాదరణే ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన్రో కాలం నుంచి ఇస్తున్న రూ. 13 నుంచి రూ.40లనే నేటికీ ఇస్తున్నారని వారు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాల మద్దతుతో రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యాచరణకు సమాయత్తమవుతున్నారు.



నేపథ్యం

పరిపాలన సౌలభ్యం కోసం కాకతీయుల కాలంలో పురుడు పోసుకుని విజయ నగర రాజుల కాలంలో పాలేగార్ వ్యవస్థ వైభవాన్ని చవిచూసింది. అడవులు నరికి వ్యవసాయ భూములు తయారు చేయడం, చెరువులు, కుంటలు నిర్మించడం ద్వారా వీరు వ్యవసాయ అభివృద్ధికి పాటుపడ్డారు. రైతుల నుంచి భూమి శిస్తు వసూలు చేసి రాజుకు చెల్లించడం, యుద్ధ సమయాల్లో అవసరమైన కట్టుబడి సైన్యాన్ని పంపడం వీరి ప్రధాన విధులుగా ఉండేవి. ఇలా గ్రామస్థాయిలో రెవెన్యూ, పోలీసు, జ్యుడిషరీ విధులను వీరు నిర్వర్తించేవారు.

మన్రో రాకతో వ్యవస్థ రద్దు

రాయలసీమ బ్రిటీషు వారికి దారాదత్తమై థామస్ మన్రో మొదటి ప్రిన్సిపల్ కలెక్టర్‌గా 1800 నవంబరు 1వ తేదీ బాధ్యతలు చేపట్టారు. అప్పటికి రాయలసీమలో 80 మంది ప్రధాన పాలేగార్స్ ఉండగా, అందులో 49 మంది కడప జిల్లాలో ఉండే వారు. బ్రిటీషు ప్రభుత్వం వీరి ఆధీనంలో ఉన్న గ్రామాలను స్వాధీనం చేసుకుంది. ఎదురు తిరిగిన వారిని గుత్తికోటలో ఉరి తీశారు. లొంగిపోయిన వారి జీవనాధారం కోసం తవర్జీ ఏర్పాటు చేశారు.

▸▸ దీనావస్థలో..

రాయలసీమలో ప్రస్తుతం 86 మంది పాలేగార్ వారసుల కుటుంబాలు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో చాలా మంది కటిక దారిద్ర్యంలో జీవిస్తున్నారు. నిరక్షరాస్యుల సంఖ్య ఎక్కువగా ఉంది. చిన్న, సన్నకారు రైతులుగా ఎక్కువ మంది కనిపిస్తారు. మరికొందరు ఉపాధి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చాక పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వీరి తవర్జీ పెంచలేదు. ఆనాడు మన్రో ఇచ్చిన రూ. 13 నుంచి రూ.40లనే నేటికీ ఇస్తున్నారు. కొంత మందికి వివిధ కారణాలతో పెన్షన్ ఆపివేయడంతో వీరిలో ఆందోళన నెలకొంది. రద్దయిన ఒకప్పటి జాగీర్లు, ఎస్టేట్స్‌లో పని చేసిన ఉద్యోగుల పెన్షన్లను రివైజ్ చేస్తున్న ప్రభుత్వాలు వీరి పెన్షన్లకు మాత్రం సాధారణ నిబంధనలు వర్తించబోవంటూ మెలిక పెడుతోంది.

ప్రాతినిధ్యం కల్పించాలి



మా తండ్రి సత్యనారాయణరావుకు 1995 వరకు రూ.881 తవర్జీ ఇచ్చేవారు. ఆయన మరణంతో ఆగిపోయింది. పాలేగార్స్ కట్టించిన దేవాలయాలకు సంబంధించిన కమిటీలలో వారసులకు ప్రాతినిధ్యం కల్పించాలి. – జానకి రఘు, ప్రధాన కార్యదర్శి, ఏపీ పాలేగార్ వారసుల సంక్షేమ సంఘం

అధికారుల చుట్టూ ప్రదక్షిణలు



మా తండ్రి కడపరాజు నారాయణరాజు చనిపోయే వరకు అంటే 1993 ఏప్రిల్ వరకు పెన్షన్ వచ్చేది. నేను లీగల్ హెయిర్ సర్టిఫికెట్ జిల్లా ట్రెజరీ అధికారికి సమర్పించగా, ఆ సంవత్సరం డిసెంబరులో అరియర్స్ ఇచ్చారు. ఆ తర్వాత పెన్షన్ ఆగిపోయింది. అప్పటి నుంచి అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేసినా ఫలితం లేకుండా పోయింది. – కె.విజయవర్మ, మట్లిరాజుల వంశీయులు

సమస్యలు పరిష్కరించాలి



చాలా కుటుంబాలకు పెన్షన్లు తొలగించారు. పెన్షన్ మొత్తాన్ని ఇప్పటి ధరలకు అనుగుణంగా పెంచడంతోపాటు నిలిపివేసిన వారికి పునరుద్ధరించాలి. ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. – వై.కేశవులు నాయుడు, అధ్యక్షుడు, ఏపీ పాలేగార్ వారసుల సంక్షేమ సంఘం

పెన్షన్ పెంచండి



మాట్లాడుతున్న ఏపీ పాలేగార్స్ వారసుల సంక్షేమ సంఘ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం పాలేగార్స్ వారసులకు ఇస్తున్న తవర్జీ (పెన్షన్) మొత్తాన్ని పెంచాలని, కొంత మందికి అర్థాంతరంగా నిలిచిపోయిన తవర్జీ పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ పాలేగార్స్ వారసుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వై.కేశవులు నాయుడు, ప్రధాన కార్యదర్శి జానకి రఘు కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు మంగమనాయుడు, నలగాటి వెంకటేశ్వర్లు, చంద్రప్పనాయుడు, బలరామయ్య, నక్కా వెంకట రమణ, పార్థసారథి నాయుడు, ఎల్.బాష, ప్రముఖ చరిత్ర పరిశోధకులు తవ్వా ఓబుల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులతో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్: అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన 2వ తైక్వాండో స్టేట్ చాంపియన్‌షిప్ పోటీల్లో వైఎస్ఆర్ కడప జిల్లా క్రీడాకారులు 16 పతకాలు సాధించినట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి. శివశంకర్‌రెడ్డి, నాయబ్‌రసూల్ తెలిపారు. జిల్లా నుంచి వివిధ కేటగిరీల్లో 41 మంది క్రీడాకారులు పాల్గొనగా 7 స్వర్ణపతకాలు, 4 రజత పతకాలు, 5 కాంస్యపతకాలను జిల్లా క్రీడాకారులు సాధించినట్లు తెలిపారు. ఇందులో స్వర్ణపతకాలు సాధించిన ఐదుగురు క్రీడాకారులు ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో సెప్టెంబర్ 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. నేషనల్స్‌కు వెళ్లే క్రీడాకారులకు ఏపీ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సమన్వయకర్త ఒంటేరు శ్రీనివాసులరెడ్డి రవాణా చార్జీలు రూ.2వేలు చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నేషనల్స్‌కు ఎంపికైన ఫాతిమా, సదీష్, వెంకటకల్యాణ్, అబ్దుల్ మజీద్, చరణ్, ఖాన్, లోక్షితలను అభినందించారు.

జానపద కళలను ప్రోత్సహించాలి

ప్రొద్దుటూరు : ప్రతి ఒక్కరూ జానపద కళలను ప్రోత్సహించాలని జనపద కళల పరిశోధకులు, మన సంస్కృతి గౌరవ సలహామండలి సభ్యులు విద్వాన్ డాక్టర్ మూలె రామమునిరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ప్రపంచ జానపద కళా దినోత్సవం సందర్భంగా తిరుపతికి చెందిన మన సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో మాసోత్సవాల్లో భాగంగా జానపద ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మూలె రామమునిరెడ్డి మాట్లాడుతూ మరుగున పడిన అలనాటి జానపద గీతాలను వెలుగులోకి తీసుకొచ్చి జీవం పోయడానికి మన సంస్కృతి కళా సంస్థ ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. మన సంస్కృతి కళా సంస్థ ప్రధాన కార్యదర్శి కలకట రెడ్డప్ప మాట్లాడుతూ జనపద కళల పునరుజ్జీవానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన ముండ్ల ఆదినారాయణరెడ్డి

గాలివీడు : ఎదురెదురుగా బస్సు, బైకు ఢీకొన్న ప్రమాదంలో ముండ్ల ఆదినారాయణ రెడ్డి(50) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు తంబళ్లపల్లి మండలం దేవరింటిపల్లెకు చెందిన ఆదినారాయణరెడ్డి గాలివీడు మండలం ఉయ్యాలవాండ్ల పల్లెలో తన కుమార్తెకు వివాహం చేశాడు. సోమవారం కుమార్తెను, మనవరాలిని చూసి తిరుగుపయనమయ్యాడు. మార్గమధ్యంలో కుమ్మరపల్లె కొయ్య మిషన్ వద్ద మదనపల్లె నుంచి వస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ అతివేగంగా వచ్చి బైకును ఢీకొన్నాడు. దీంతో ద్విచక్రవాహనం నడుపుతున్న ఆదినారాయణరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళా రైతుకు పాముకాటు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుజాత

తంబళ్లపల్లె : మహిళా రైతును పాము కాటేసిన సంఘటన మండలంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు కోసువారిపల్లె పంచాయతీ కొప్పలవారిపల్లెకు చెందిన కొప్పల సుజాత పొలంలో ఉండగా కట్ల పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. గుర్తించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన




ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలో మహబూబ్ నగర్‌కు చెందిన మహిళలు సోమవారం గ్రామంలో ఖాళీ బిందెలతో నిరస వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఇళ్లలో ఉన్న మంచినీటి కొళాయిలకు నీళ్లు రావడం లేదన్నారు. దిగువ ప్రాంతాలకు నీళ్లు వెళ్లిపోతున్నాయన్నారు. నీటి సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు. ఈ విషయమై ఎంపీడీఓ ఉమామహేశ్వరరావును వివరణ కోరగా పెన్నానది నుంచి వచ్చే తాగు నీటి పైప్‌లైన్‌కు కొంతమంది అక్రమ కనెక్షన్లు తీసుకున్నట్లు నిర్ధారించామన్నారు. అలాగే మహబూబ్‌నగర్ వద్ద గేటు వాల్ మరమ్మతులకు గురైందన్నారు. సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దృష్టికి తీసుకెళ్లామని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

బిరబిరా కృష్ణమ్మ పరుగులు తీసేదెప్పుడు.!

- డెడ్ స్టోరేజీకి చేరుకున్న గండికోట, మైలవరం జలాశయాలు
- కృష్ణా జలాల కోసం ఎదురు చూస్తున్న రైతులు



ఎండిపోయిన గండికోట ప్రాజెక్టు

జమ్మలమడుగు : గండికోట జలాశయంలోకి బిరబిరా కృష్ణమ్మ పరవళ్లు ఎప్పుడు వస్తాయో అని రైతులు, ప్రజలు ఎదురు చూస్తున్నారు. గత ఏడాది సరైన వర్షాలు పడకపోవడంతో మైలవరం జలాశయం, గండికోట జలాశయంలోని నీటి నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయి. ప్రస్తుతం రెండు జలాశయాల్లో కనీసం రెండు టీఎంసీల నీరు కూడా నిల్వ లేదని అధికారులు పేర్కొంటున్నారు.

అవుకు రిజర్వాయర్‌కు 600 క్యూసెక్కుల నీరు విడుదల

వెలుగోడు ప్రాజెక్టు నుంచి నంద్యాల జిల్లా అవుకు రిజర్వాయర్‌కు గాలేరు-నగరి కాలువల ద్వార 600 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం అవుకు రిజర్వాయర్‌లో 1.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పూర్తి స్థాయిలో నీటిని నింపాలంటే 4.5 టీఎంసీల నీరు ఉండాలి. జలాశయంలోకి నిల్వ సామర్థ్యం మేరకు నీరు రావాలంటే కనీసం నెలరోజులకు పైగా పట్టే అవకాశం ఉంది. గాలేరు-నగరి కాలువల ద్వారా ఒక టీఎంసీ నీరు చేరాలంటే కనీసం పదివేల క్యూసెక్కుల నీరు ఒక్కరోజు పారితే నాలుగు రోజుల్లో జలాశయం నిండుతుంది. ఆ తర్వాత గాలేరు-నగరి కాలువకు నీటిని విడుదల చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఆ స్థాయిలో నీరు రావడం లేదు.

గండికోటలో 1.4 టీఎంసీల నీరు..

గండికోట జలాశయంలో పూర్తిస్థాయి నీటి మట్టం 26 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయంలో కేవలం 1.4 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. సరైన వర్షాలు లేకపోవడంతో ఉన్న నీరు తాగునీటి అవసరాలకు మాత్రమే సరిపోతున్నాయి. రైతుల పంట పొలాలకు వదిలే పరిస్థితి లేదు. దీంతో ఈ ఏడాది గండికోట ప్రాజెక్టులోకి కేవలం శ్రీశైలం నుంచి వచ్చే కృష్ణా జలాలపైనే ఆధారపడాల్సి వస్తోంది.

మైలవరంలో...

మైలవరం జలాశయం నీటి సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయంలో 0.585 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈ నీరు ప్రతిరోజు జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రజల దాహార్తి తీర్చడం కోసం, మరి కొంత నీరు ఆర్టీపీపీకి పంపింగ్ చేయాల్సి ఉంది. మరి కొద్ది రోజుల్లో మైలవరం జలాశయం పూర్తిగా డెడ్ స్టోరేజిలోకి వెళ్లిపోతుంది. సరైన వర్షాలు లేకపోవడంతో పెన్నానది పరివాహక ప్రాంతాల నుంచి నీరు గండికోటలో చేరుతుంది తప్ప మైలవరం జలాశయంలోనికి రాదు. దీంతో కొండ ప్రాంతంలో పడిన నీరు మాత్రమే జలాశయంలోకి రావాల్సి ఉంది.

శ్రీశైలంపైనే ఆశలు...

రాయలసీమ ప్రజలకు సాగునీరు.. తాగునీరు అందించాలనే లక్ష్యంతో నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గండికోట ప్రాజెక్టును పూర్తి చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంచి శ్రీశైలం ప్రాజెక్టుకు వరద వచ్చి నిండిన తర్వాత వేగంగా నీటిని గండికోట ప్రాజెక్టుకు తరలించే విధంగా, గాలేరు-నగరి వరద కాలువల్లో పదివేల క్యూసెక్కుల నీరు ప్రవహించే విధంగా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం నెలరోజుల నుంచి భారీగా వరదలు వచ్చి శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండలా తయారైంది. ఇంకా వరద నీరు వస్తుండటంతో గేట్ల ద్వారా నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. గాలేరు-నగరి వరద కాలువ ద్వారా బనకచర్ల, వెలుగోడు ప్రాజెక్టులను నింపిన తర్వాత అవుకు రిజర్వాయర్ నుంచి మైలవరం, గండికోట ప్రాజెక్టులకు నీరు రావాల్సి ఉంది. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పడుతున్నాయి. దీనికితోడు కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో వరద తగ్గుముఖం పడుతోంది. ప్రస్తుతం అవుకు రిజర్వాయర్‌కు కేవలం ఆరు వందల క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో భవిష్యత్తులో ఎక్కువ నీరు విడుదలైతే తప్ప గండికోట, మైలవరం ప్రాజెక్టులకు నీరు వచ్చి చేరే పరిస్థితి కనిపించడం లేదు.

ఒక్కడి కోసం ఇద్దరు విషం తాగారు

- భార్య,ప్రేయసి మధ్య వివాదం
- మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దుర్గమ్మ, లక్ష్మి

మదనపల్లె : తన భర్త తనకే కావాలని ఒకరు, తాను ప్రేమించిన వాడు తనకే భర్తగా ఉండాలని మరొకరు ఇద్దరు మహిళలు గొడవపడి ఒకే వ్యక్తి కోసం ఇద్దరు విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. మదనపల్లి పట్టణం చంద్ర కాలనీకి చెందిన రెడ్డి శేఖర్, దుర్గమ్మ(22)దంపతులు. ఇరువురు మదనపల్లె మార్కెట్ యార్డులో పనిచేస్తూ జీవిస్తున్నారు. వీరికి పిల్లలు లేరు. అయితే కడప పట్టణానికి చెందిన శ్రీనివాసులు భార్య లక్ష్మి (28), తనను భర్త వదిలి వెళ్లిపోవడంతో, దిక్కుతోచని స్థితిలో ఇద్దరు పిల్లలతో కలిసి ఉపాధి కోసం మదనపల్లె చంద్ర కాలనీకి వచ్చి నివాసం ఉంటోంది. ఈమె కూడా మదనపల్లె మార్కెట్ యార్డులో పనులు చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో రెడ్డి శేఖర్ కు లక్ష్మితో పరిచయమైంది. రెండు వారాల క్రితం ఆమెను రెడ్డి శేఖర్ రహస్యంగా వివాహం చేసుకున్నాడు. ఈ విషయం తెలిసిన దుర్గమ్మ సోమవారం లక్ష్మితో గొడవ పడింది. ఇద్దరు ఒకరికొకరు రెడ్డిశేఖర్ తనకే భర్త అంటూ గొడవపడ్డారు. గొడవను అవమానంగా భావించి ఒకరు విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, వెంటనే మరో మహిళ సైతం విషం తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు ఇరువురిని మాలపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స అనంతరం కోలుకుంటున్నారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు డీఏవీ భారతి విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ కిషోర్, హెచ్‌ఆర్ గోపాల్‌రెడ్డి

కమలాపురం : మండల పరిధిలోని నల్లలింగాయపల్లెలో ఉన్న భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీపీఎల్) లోని డీఏవీ భారతి విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శివం కిషోర్ కుమార్ తెలిపారు. ఏసీసీ వాడి డీఏవీ క్లస్టర్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ 2024-25 కర్ణాటకలోని కల్బుర్గి వాడి డీఏవీ పాఠశాలలో జరిగింది. ఈ మీట్‌కు హాజరైన డీఏవీ భారతి విద్యార్థులు పలు క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 బాలుర విభాగం చదరంగం పోటీల్లో ఎస్‌ఎంవీ కౌశిక్, డి.రామ్ చరణ్, ఎం.లోహితేశ్వ, ఐ.చక్రధర్ రెడ్డి, కె. సనత్ సిద్దార్థ్ ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే అండర్-17 బాలుర విభాగం అథ్లెటిక్స్ పోటీల్లో 1500 మీటర్ల పరుగు పందెంలో బి. చంద్ర ఓబులరెడ్డి ద్వితీయ స్థానంలో, అండర్-14 కబడ్డీ బాలుర, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. అండర్-17 బాలుర అథ్లెటిక్స్‌లో ఎం. నరేష్ డిస్కస్ త్రో, 800 మీటర్ల విభాగంలో తృతీయ స్థానంలో, అండర్-17 బాలికల అథ్లెటిక్స్ విభాగంలో జి. గురు కీర్తన షాట్‌పుట్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారు. వీరంతా త్వరలో జరిగే డీఏవీ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపల్ వివరించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, పీడీ చందును అధికారులుఅభినందించారు.

రాణించిన కడప బ్యాట్స్‌మన్

- హాఫ్ సెంచరీలు నమోదు చేసిన నలుగురు
- 9 వికెట్లు తీసిన నెల్లూరు బౌలర్ హమీద్



76 పరుగులు చేసిన రోహిత్



9 వికెట్లు తీసిన హమీద్



5 వికెట్లు తీసిన దొరబాబు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో కడప బ్యాట్స్‌మన్ నలుగురు హాఫ్ సెంచరీలతో రాణించారు. కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 91.1 ఓవర్లలో 347 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఆర్. రోహిత్ 76, సాయిచేతన్ రెడ్డి 72, ఎన్.గురుచరణ్ 70 పరుగులు చేశారు. ప్రణవ్‌కుమార్‌రెడ్డి 66 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్ హమీద్ 23.4 ఓవర్లలో 83 పరుగులు ఇచ్చి 9 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 1 ఓవర్‌లో వికెట్ నష్టపోకుండా 6 పరుగులు చేసింది.

వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియం..

వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కృష్ణా, శ్రీకాకుళం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కృష్ణా జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 71.1 ఓవర్లలో 219 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ధనుష్ 62, వరుణ్‌సాత్విక్ 34, భానువరప్రసాద్ 34 పరుగులు చేశారు. శ్రీకాకుళం బౌలర్లు పూర్ణ 4, సుశాంత్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు 12.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 34 పరుగులు చేసింది. జట్టులోని సుశాంత్ 20 పరుగులతో క్రీజులో ఉన్నాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన పశ్చిమగోదావరి జట్టు 54.4 ఓవర్లలో 262 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రక్షణ్ 50 పరుగులు, యశ్వంత్ 42 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లు దొరబాబురెడ్డి 5 వికెట్లు, సాయిచరణ్ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 34 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. జట్టులోని హర్షసాయిరెడ్డి 55 పరుగులు చేశాడు. పశ్చిమగోదావరి బౌలర్లు యశ్వంత్ 2 వికెట్లు తీశాడు.

సెప్టెంబరు 7, 8 తేదీల్లో ఆరోగ్యమాత ఉత్సవాలు

కడప కల్చరల్ : కడప నగరం రైల్వేస్టేషన్ వద్దగల ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం ఉత్సవాలు సెప్టెంబర్ 7, 8 తేదీలలో వైభవంగా నిర్వహించనున్నామని పుణ్యక్షేత్ర డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఎండీ ప్రసాదరావు తెలిపారు. సోమవారం ఆరోగ్యమాత చర్చిలో తిరునాల పోస్టర్లను సహాయ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ పిల్లి మహేష్, ఆరోగ్యమాత మదర్ జనరల్ సుపీరియర్ సెల్వి రాయప్పన్, చర్చి పెద్దలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంథోని, రాజన్, డేవిడ్, జార్జి, సెబాస్టిన్, విక్టర్, మోహన్, రాజకుమార్, జయరాజ్, యూత్ కమిటీ సభ్యులు ప్రసాద్, విన్సెంట్ ది పాల్, ఆ క్షేత్రం అన్ని విభాగాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 15.5 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం



కారుతోసహా ఎర్రచందనం స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు

పీలేరు : కారుతో సహా రూ. 15.5 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ జె.వి. సుబ్బారెడ్డి తెలిపారు.ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముందుగా అందిన సమాచారం మేరకు పులిచెర్ల మండలం కల్లూరు నాలుగు రోడ్ల కూడలిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో నెంబరు ప్లేటులేని కారు వేగంగా రావడం గమనించి సిబ్బంది ఆపే ప్రయత్నం చేశారు. కారు ఆపకుండా వేగంగా ముందుకు వెళ్లి తిరుపతి బైపాస్ రోడ్డు చెర్లోపల్లె వద్ద కారును రోడ్డు పక్కన ఆపి నిందితులు పరారయ్యారు. వెంబడించిన అటవీ సిబ్బంది వాహనాన్ని పరిశీలించగా 349 కేజీల బరువు గల 22 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. కారుతో సహా ఎర్రచందనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఆర్ఓ వెంకటరమణ, సిబ్బంది ప్రతాప్, నాగేంద్రబాబు, వెంకటేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కన్నెమడుగు విద్యార్థులు



ప్రణీత



సుమిత్ర



మహేష్



సుబ్రమణ్యం



రుషిత

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థులు అన్నమయ్య జిల్లా తరపున రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మదన్‌మోహన్, పీడీ మొగల్‌బాషా తెలిపారు. ఆదివారం పీలేరు భువన విద్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి ప్రణీత, సుమిత్ర, పదో తరగతి విద్యార్థి మహేష్, సుబ్రమణ్యం ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్టాండ్‌బైగా 8వ తరగతి రుషిత ఎంపికయ్యారు. వీరు ఈ నెల 10,11 తేదీల్లో చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

భూ రికార్డులు తగులబెట్టినవారిని అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి

రాయచోటి అర్బన్ : మదనపల్లె సబ్- కలెక్టర్ కార్యాలయంలోని భూమి రికార్డులను తగులబెట్టినవారిని వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గతంలో జిల్లా వ్యాప్తంగా అనేక భూ కుంభ కోణాలు జరిగాయన్నారు. మదనపల్లెతో పాటు తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో కుంభకోణాలు బయట పడతాయనే భయంతో కొందరు మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని భూమి రికార్డులను తగులబెట్టారన్నారు. రికార్డులను తగులబెట్టిన వారితో పాటు వారికి సహకరించిన రెవెన్యూ అధికారులపై పోలీసులు కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈనెల 12వ తేదీన అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణంలో అలసత్వం తగదు

– మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



బ్రిడ్జిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని రెడ్డివారిపల్లి బ్రిడ్జి నిర్మాణ పనుల విషయంలో అలసత్వం తగదని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం ఆయన నిలిచిపోయిన బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రూ.16 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. అలాగే రూ. 50 కోట్లతో చిట్వేలి-కోడూరు రోడ్డు విస్తరణ, రూ. 250 కోట్లతో సోమశిల బ్యాక్ వాటర్ వంటి ప్రతిష్టాత్మక పనులు చేపట్టామన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఈ పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వం, అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేదంటే ప్రజల తరపున పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, మండల నాగేంద్ర, సీహెచ్ రమేష్, ఆర్‌వీ రమణ, బండారు మల్లికార్జున, రత్తయ్య, ఆంజనేయులు, గునిశెట్టి రమేష్, రాజ, సిద్దయ్య, రఘు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులను ఆపాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న స్కీం వర్కర్లు

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్న తమపై రాజకీయ వేధింపులను వెంటనే ఆపాలని స్కీం వర్కర్లు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో స్కీం వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు, కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ చిరుద్యోగులైన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు యానిమేటర్లు తమ పదవులకు రాజీనామా చేయాలంటూ ఆయా ప్రాంతాల కూటమి నేతలు ఒత్తిడి తెస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా స్కీం వర్కర్లను మార్చేందుకు ఆయా పార్టీల నేతలు ప్రయత్నించడం దారుణమన్నారు. ఇప్పటికైనా కూటమి నేతలను ప్రభుత్వం కట్టడి చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ యూనియన్, ఆశా వర్కర్ల సంఘం, మధ్యాహ్న భోజన సంఘం, పంచాయతీ వర్కర్స్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న రైతు గంగిరెడ్డి

వేముల : అప్పుల బాధ తాళలేక దుంపల గంగిరెడ్డి(52) అనే రైతు ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నారేపల్లె గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దుంపల గంగిరెడ్డి పంటలు పండక, దిగుబడులు రాక నష్టపోయాడు. సాగు కోసం చేసిన అప్పులు పెరిగిపోయాయి. గత కొంత కాలం నుంచి భార్యకు, కుమారునికి ఆరోగ్యం సరిగా లేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి ఇంటిలోని వంటగదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై చిన్నకుమారుడు మణికంఠారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు.

అనారోగ్యంతో..

లింగాల : లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలోని సోత్రిమ్‌లో నివాసముంటున్న కేతిరెడ్డి ఓబులరెడ్డి (60) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆయనకు డయాబెటీస్, గుండెజబ్బు వంటి వ్యాధులు ఉన్నాయని, వ్యాధులు నయం కావన్న భయంతో శుక్రవారం చీనీ పంటలకు కొట్టే పురుగుమందును తాగాడు. వెంటనే పులివెందులలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆయనకు భార్య వసుంధర, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో రామసముద్రం వాసి మృతి



రామచంద్ర (ఫైల్)

రామసముద్రం : రోడ్డు ప్రమాదంలో రామసముద్రం వాసి మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. రామసముద్రం మండలం బూసానికురప్పల్లి గ్రామానికి చెందిన కె.రామచంద్ర (55) ఆదివారం సాయంత్రం కాలిఫ్లవర్‌ను ఐచర్ వాహనంలో చెన్నై మార్కెట్‌కు తీసుకెళ్తుండగా రాణిపేట వద్ద కారును తప్పించబోయి వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రామచంద్ర అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం సోమవారం రాత్రి మృతదేహం స్వగ్రామానికి తరలించారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

మదనపల్లె : జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారయ్యారని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. మండలంలోని మాలేపాడు పంచాయతీ అడవిలోపల్లె సమీపంలో జూదమాడుతున్నట్లు ఆదివారం సాయంత్రం సమాచారం అందడంతో ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారయ్యారని తెలిపారు. వారి వద్ద నుంచి రూ.64,070 నగదు స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

సాఫ్ట్ వేర్ ఉద్యోగిపై దాడి

మదనపల్లె : తన ఇంటి పరిసరాల్లో మద్యం సేవించవద్దన్నందుకు మందుబాబులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై దాడి చేసిన సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పట్టణంలో నీరుగట్టు వారి పల్లె బయ్యా రెడ్డి కాలనీకి చెందిన శ్రీనివాసులు(32) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చి వర్క్ ఫ్రం హోం లో భాగంగా ఇంటి వద్దనే విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి కొందరు మందుబాబులు తన ఇంటి సమీపంలో మద్యం సేవించి గట్టిగా అరుస్తూ గోల చేస్తూ ఉండడంతో, ఇక్కడ మద్యం తాగ వద్దంటూ వారిని అడ్డుకున్నాడు. దీంతో వారు శ్రీనివాసులపై దాడికి పాల్పడ్డారు. దాడి ఘటనపై పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలి

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని సి.కొత్తపల్లె గ్రామ పొలంలో కబ్జాకు గురైన కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను తక్షణమే స్వాధీనం చేసుకుని కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సి.కొత్తపల్లె పొలంలో గత 5 నెలలుగా ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. అలాగే ఈ నెల 2న పేదల గుడిసెలను తొలగించి దళిత మహిళలపై దాడికి పాల్పడిన టీడీపీ నాయకులు రామచంద్రారెడ్డి, ఆయన అనుచరులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లును వ్యతిరేకించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లును వ్యతిరేకించాలని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కె.సి.బాదుల్లా కోరారు. సోమవారం నగరంలోని ఇన్సాఫ్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముస్లింల భూ యాజమాన్య హక్కులను హరించేందుకు, ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చే కుట్రలో భాగంగా మోదీ ప్రభుత్వం ఈ కుట్రకు పాల్పడుతోందన్నారు. తెలుగుదేశం, జనసేన, వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఈ బిల్లును వ్యతిరేకించాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ముస్లింల ఆస్తులను కాపాడేందుకు 1954 వక్ఫ్ చట్టం తీసుకొచ్చారన్నారు. ప్రస్తుతం వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని కాపాడేందుకు ఎండోమెంట్ తరహాలో అధికారాలు ఇవ్వాల్సింది పోయి వక్ఫ్ ఆస్తులను కాజేసే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు.